

స్వేచ్ఛ ఎవరి నుండి ఇవ్వబడదు,
మనకు మనమే తీసుకోవాలి.
- సుభాష్ చంద్రబోష్

REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్ అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.

మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 1 సంచిక : 140 ఎడిటర్ : నరేష్ సాకే వార సంచిక : ( 02 - 04 - 2022 ) పేజీలు : 8

## దీక్షను భగ్నం చేసిన తీరు ఆక్షేపణీయం



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామ రహదారి విషయమై గ్రామస్తులు, జనసేన నాయకులు, శ్రేణులు మూడు రోజులుగా చేస్తున్న నిరాహారదీక్షను పోలీసులు భగ్నం చేసిన తీరు ఆక్షేపణీయంగా ఉందని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యంగా జనసేన నాయకురాలు శ్రీమతి కోట వినుత, ఆమె భర్త పట్ల వ్యవహరించిన తీరు దురదృష్టకరం. ప్రజల పక్షాన గొంతెత్తడమే నేరం అన్నట్లు వై.సి.పి. ప్రజా ప్రతినిధులు వ్యూహరచన చేస్తూ అధికార గణాన్ని నడిపిస్తున్నారు. నిరాహార దీక్ష చేస్తున్నవారిపై బల ప్రయోగం చేయడమే కాకుండా వారిపై 307, ఎస్.సి.,ఎస్.టి. ఎట్రాసిటీ యాక్ట్ వంటి బలమైన 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం వెనుక వై.సి.పి. పెద్దలు ఉన్నారన్నది సుస్పష్టం. ఎస్.సి., ఎస్.టి. ఎట్రాసిటీ చట్టాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారో ప్రజలంతా అర్థం చేసుకుంటున్నారు. నిన్న అదుపులోకి తీసుకున్న జనసేన నాయకులను ఈ రోజు ఇళ్లకు పంపించారు. అదే విధంగా గ్రామస్తుల కోరిక మేరకు రహదారిని పునరుద్ధరించాలి. కేసులన్నీ తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. చిందేపల్లి వాసులకు జనసేన భవిష్యత్తులో కూడా అండగా ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నానని జనసేనాని పేర్కొన్నారు.

శ్రీకాళహస్తి ( జనస్వరం ) : ఏర్పేడు మండలం, చిందే పల్లి గ్రామానికి వెళ్ళే R&B రోడ్డు ను LANCO/ECL ఫ్యాక్టరీ యాజమాన్యం మూసివేయడం జరిగింది. రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ గారి దగ్గరకి సమస్య తీసుకుని వెళ్ళినా ఎవరు స్పందించలేదు. శాంతి యుతంగా గ్రామస్థులు , మేము నిరసన తెలుపుతూ ఉంటే పోలీస్ లు గ్రామస్తులను, మమ్మల్ని అక్రమం గా అరెస్టులు చేస్తూ, కేసులు పెడుతూ, గ్రామస్థుల పై లాఠీ ఛార్జ్ చేస్తే బయబ్రాంతులకు గురిచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యం తో కుమ్మక్కై ప్రజలను తీవ్ర ఇబ్బందులు



పెడుతున్నారు. ఎక్కడ వారి నిరసన తెలపాలన్నా ఇబ్బందులకు గురి చేస్తున్నారని శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జ్ వినుతా కోటా ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు గ్రామస్థులతో కలిసి జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి శ్రీమతి వినుత కోటా గారు ఏర్పేడు మండలం, చిందేపల్లి గ్రామంలోని శివాలయం నందు రాజ్యాంగబద్దంగా , శాంతి యుతంగా నిరాహార దీక్షమొదలు పెట్టాము. మా నిరాహార దీక్ష చిందే పల్లి గ్రామానికి వెళ్ళే రోడ్డు పై కట్టిన అక్రమ గోడను తొలగించే వరకు కొనసాగుతుంది. మాతో పాటు గ్రామస్థులు, మహిళలు పెద్ద ఎత్తున నిరాహార దీక్షలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు.

## పురపాలక సంఘం సమావేశంలో దాడి అధికార పక్షం దౌర్జన్యానికి పరాకాష్ట

న్యూస్ ( జనస్వరం ) : తెనాలి పురపాలక సంఘం సమావేశంలో ఈ రోజు చోటు చేసుకున్న భౌతిక దాడి ఘటన అప్రజాస్వామికమని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో ఖండించారు. పట్టణంలో సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలపై విలువైన చర్చలు చేయాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని అధికార పక్షం తమ దౌర్జన్యానికి వేదికగా మార్చుకొంది. 20వ వార్డు కౌన్సిలర్ శ్రీ దేసు యుగంధర్ పై వైసీపీ పక్షం దాడి చేయడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే వైసీపీ దౌర్జన్యం చేస్తోంది. తెనాలి పట్టణ ప్రజలు ప్రశాంత జీవన విధానాన్ని కోరుకుంటారు. అధికార బలం ఉందని



కౌన్సిల్ సమావేశంలోనే ప్రతిపక్షానికి చెందినవారిపై దాడులకు తెగబడితే ప్రజలు హర్షించరు. కచ్చితంగా ప్రజాస్వామ్య పద్ధతిలోనే సమాధానం ఇస్తారని శ్రీ నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.


## రాజధాని రైతులకు మద్దతుగా నిలిస్తే దాడులు చేస్తారా?

న్యూస్ ( జనస్వరం ) : బీజేపీ జాతీయ కార్యదర్శి శ్రీ సత్య కుమార్ పై దాడి గర్హనీయం ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు 1200 రోజులుగా చేస్తున్న దీక్షలకు మద్దతు పలికిన బీజేపీ జాతీయ కార్యదర్శి శ్రీ వై.సత్య కుమార్ గారిపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటం గర్హనీయమని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో ఖండించారు. అధికారంలో ఉన్న వైసీపీ దాదాగిరీ పరాకాష్టకు చేరిందనే వాస్తవం ఈ దాడితో మరోమారు తేటతెల్లమయింది. ఈ దాడిని ప్రతి ప్రజాస్వామ్యవాది ఖండించాలి. రాజధాని రైతులకు మద్దతుగా నిలిస్తే దాడులు చేస్తామని రాష్ట్ర పాలకులు సందేశం ఇస్తున్నారా? ఇదే వైసీపీ ముఖ్యమంత్రి శ్రీ జగన్ రెడ్డి గారి విధానం అయితే మేము కచ్చితంగా ప్రజాస్వామ్య పద్ధతిలోనే సమాధానం ఇస్తాం. 'ఆదినారాయణ రెడ్డి తప్పించుకున్నారు' అని వైసీపీ ఎంపీ ప్రకటించారు అంటూ శ్రీ సత్య కుమార్ గారు చెప్పిన మాటలపై పోలీసులు దర్యాప్తు చేపట్టాలి. రాజధాని ప్రాంతంలో వైసీపీ శ్రేణులు చేసిన ఈ దాడి ఘటనను బీజేపీ అధినాయకత్వం తీవ్రంగా పరిగణించాలి. కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలి. మూడు రాజధానులు అంటూ ప్రజలను మభ్యపెడుతున్న వైసీపీ ముఖ్యమంత్రినీ, ఆయన పార్టీనీ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని పట్టభద్రులే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తిరస్కరించారు. క్షోభపడుతున్న రాజధాని రైతులకు అండగా నిలుస్తున్న రాజకీయ పక్షాలను, సంఘాలను వైసీపీ ముఖ్యమంత్రి, ఆయన అనుచరులు వర్గ శత్రువులుగా చూస్తున్నారు. రాష్ట్ర పాలకులు సామాన్య ప్రజలపైనా, ప్రశ్నించిన వారిపైనా ఏ విధంగా దౌర్జన్యాలు చేస్తున్నదీ, ప్రతిపక్ష నాయకులను వేధిస్తూ, వారిపై దాడులకు పాల్పడుతున్నదీ త్వరలోనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి జనసేన పార్టీ తీసుకువెళ్తుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## జనసేన వైపు మేధావి వర్గం చూపు.. భీమిలి జనసేనపార్టీలోకి చేరికలు



భీమిలి ( జనస్వరం ) : మేధావి వర్గం.. రిటైర్డ్ ఉద్యోగులు.. సమాజానికి మంచి జరగాలన్న ఆకాంక్ష కలిగిన తటస్థులంతా జనసేన పార్టీ వైపు చూస్తున్నారు. పార్టీ కండువా కప్పుకుని మరీ రాజకీయ పోరాటానికి సిద్ధమైపోతున్నారు. శుక్రవారం ఉదయం విశాఖ జిల్లా, భీమిలి నియోజకవర్గంలో సుమారు 100 మంది వివిధ రంగాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, టీచర్లు, మేధావులు జనసేన పార్టీలో చేరారు. 6వ వార్డు రామాలయం ఎదురుగా ఉన్న పీఎంపాలెం హెచ్.పి.సి.ఎల్. పార్క్ లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వీరంతా జనసేన కండువాలు కప్పుకున్నారు. సీనియర్ రిటైర్డ్ ఉద్యోగి చంద్రరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇంఛార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల చేతుల మీదుగా వీరంతా జనసేనలోకి చేరారు. రానున్న మార్పుకు, ప్రజల్లో జనసేన పట్ల పెరుగుతున్న నమ్మకానికి నేటి చేరికలు ఉదాహరణ అని ఈ సందర్భంగా సందీప్ వ్యాఖ్యానించారు.



# జగన్ రెడ్డి_ _ _. ఓ రాజకీయ వైఫల్యం

## ఎడిటోరియల్

ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతి ఒక్కరూ నాయకుడు అవ్వలేరు. ప్రజలు అత్యంత భారీ మెజారిటీతో గెలిపించిన జగన్ రెడ్డి గారి మూడేళ్ల ప్రస్థానం గురించి క్లుప్తంగా చర్చించుకుందాం. శాసనం ద్వారా నిర్మితమై, భారత రాజ్యాంగం పట్ల నిజమైన విధేయత, విశ్వాసం చూపుతానని, రాగ ద్వేషాలు గానీ, పక్షపాతం గానీ లేకుండా శ్రద్ధతో అంతఃకరణ శుద్ధితో నా భాధ్యతలను నిర్వహిస్తానని ప్రమాణం చేసిన జగన్ రెడ్డి గారు దాన్ని ఎంతవరకు నిలబెట్టుకున్నారో ఓసారి మాట్లాడుకుందాం.

ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ ఎంతో బాధ్యతగా ఉండాల్సిన వ్యక్తి నేడు ఆ అధికారాన్ని దుర్వినియోగపరుస్తున్నారు. వేల కోట్లు వ్యాపారాలు చేస్తూ లెక్కలేనంత గడించిన ఒక వ్యక్తి ముఖ్యమంత్రి అవ్వగానే, ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కట్టిన ఇంటికి బాత్రూం కోసమని, కిటికీల కోసమని 16 కోట్లు ప్రజాధనాన్ని వెచ్చించటం అత్యంత హీనమైన చర్య. అదే కాక పెరోల్ మీద గూండాలను, అంతర్జాతీయ స్మగ్లర్లను విడుదల చేయటం దేనికి సంకేతం? సమగ్ర పాలనలో జగన్ రెడ్డి గారు పూర్తిగా విఫలం అయ్యారు. ఆయన నిలకడలేని నిర్ణయాలు,, మాట మార్చిన వైనాలు కోకొల్లలు. తీసుకున్న నిర్ణయాల్లో దాదాపు 80 సార్లు న్యాయస్థానాలు జోక్యం చేసుకుని, చీవాట్లు పెట్టింది. అత్యున్నత స్థాయి అధికారులు, ఐఏఎస్ లు, ఐపిఎస్ లు కోర్టులకు వెళ్ళడం, జైలు శిక్షలు అనుభవించటం చాలా సాధారణం అయిపోయింది. పాలనపరమైన పరిజ్ఞానం లేకపోవడం, మొండి వైఖరి, కక్ష సాధింపు రాజకీయాలకు తెరతీసి చెడ్డపేరు తెచ్చుకున్నారు.ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తీసుకునే నిర్ణయాలు, చేసే విధానాలు, పాలసీలు అన్నీ ప్రజల మీద ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రభావం చూపుతాయి. అప్పటి దాకా ఉచితంగా దొరికిన ఇసుకను, రీచ్ ల పేరుతో వ్యాపారం చెయ్యడం, సామాన్యుడికి అందనివ్వకుండా, దళారీ వ్యవస్థ కు అప్పగించడం, ఒక స్పష్టమైన నిర్దిష్టమైన విధానాలు తీసుకునిరాకుండా కాలయాపన చేసి 75 లక్షల భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేశారు.

మాట తప్పం మడమ తిప్పము అని జనాన్ని నమ్మించి ఓటు బ్యాంక్ సంపాదించిన జగన్ రెడ్డి గారు అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తాను అన్న మాట ఇచ్చి, ముఖ్యమంత్రి అయ్యాక మాత్రం దశలు వారీగా చేస్తానని మాట తప్పారు.. మద్యం ధర రెండింతలు చేసి, కడపలో మద్యం తయారీ చేసే కంపెనీల ద్వారా మద్యాన్ని కొంటూ, నేడు ప్రభుత్వమే మద్యాన్ని అమ్మేలా మార్చేశారు. గెలిచిన మూడేళ్లలో మద్యం మీద వచ్చిన ఆదాయం పెరిగిందే కానీ తగ్గలేదు. 2022-23 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో మద్యం నుండి వచ్చే అంచనా ఆదాయం 16 వేల కోట్లకు పైచిలుకు. గత ఏడాదితో పోలిస్తే ఇది 1500 కోట్లు ఎక్కువ. మరి ఎక్కడ మద్యపాన నిషేధం? ఇక్కడితో ఇది ఆగలేదు వచ్చే ఐదేళ్లలో మద్యం నుండి వచ్చే రాబడిని చూపించి అప్పులు చేయడం అత్యంత హీనమైన చర్య. ఇదేనా విశ్వసనీయత అంటే?

ప్రతిపక్షం లో ఉన్నప్పుడు అమరావతి అయితే అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉంటుంది. అమరావతిని రాజధాని చెయ్యడం మంచిదే అని గుడి లాంటి అసెంబ్లీలో చెప్పిన జగన్ రెడ్డి, ఎన్నికలో గెలిచి ముఖ్యమంత్రి అవ్వగానే తూచ్ అనేశారు. ఒక్కటి కట్టడానికే మనకు నిధులు లేవంటే మూడు రాజధానులు అంటూ మాట మార్చేశారు. పోనీ అదైనా జరిగిందా అంటే అదీ లేదు. ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోలేని వ్యక్తి. ఇలా పూటకో మాట మీద ఉంటే ప్రభుత్వం మీద నమ్మకం, భరోసా ఎలా ఉంటుంది? పెట్టుబడులు పెట్టాలి అంటే స్పష్టమైన, నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకునే వారే ఉండాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలాగా, అధికారంలోకి వచ్చాక ఇంకోలా మారితే పెట్టుబడులు కూడా రావు. గెలిచిన అధికార పార్టీ ఎంపీ ఒకరు నేరుగా కియా కంపెనీకి వెళ్లి గొడవ చేయడం లాంటివి చేస్తే వేరే కంపెనీలు, పెట్టుబడులు ఎలా వస్తాయి? 16 మెడికల్ కాలేజీ లు, కడపలో ఉక్కు కర్మాగారం ఇలాంటి వాటికి వేసిన శంకుస్థాపనలు శిథిల స్థాయికి చేరుకుంటున్నాయి కానీ ఇంతవరకు కనీసం ఒక్క ఇటుక వేసింది లేదు.

మన ఇల్లైనా, రాష్ట్రమైన, దేశమైనా, ప్రపంచమైనా నడిచేది ఆర్థిక




వనరుల మీదే. అలాంటి ఆర్థిక వనరులు అభివృద్ధి చెయ్యాలిగాని, అప్పులు చేసి పప్పుకూడు తినకూడదు. కరోనాలాంటి మహమ్మారి వచ్చాక ఆర్థిక పురోగతి చాలా తగ్గింది. అలాంటప్పుడు ఆర్థికాభ్యుద్ధికి కంకణం కట్టుకోవాలి. ఎందుకంటే జేబులో రూపాయి ఉంటేనే ధైర్యంగా ఉంటుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు వారికి స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పే చర్యలు తీసుకోవాలి. తగిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తే పెట్టుబడులు పెడతారు. ఉద్యోగాలు వస్తాయి. ఇవన్నీ వదిలేసి ఎంతసేపు అప్పులు దొరికితే తీసుకొచ్చి నాలుక మడతపడే అన్ని పథకాల పేర్లతో డబ్బులు పంచడం చాలా విచారకరం. ఎంతసేపు ప్రచార ఆర్భాటాలు తప్ప, చేసిన అభివృద్ధి ఏముంది రాష్ట్రంలో? పేపర్ ప్రకటనల కోసం పెట్టిన దాంట్లో పాతిక శాతం కూడా ముఖ్యమంత్రి సహాయనిధి కింద పేదల కోసం ఖర్చు చేయలేదు. రంగుల పేరుతో 3000 కోట్లు ఖర్చు చేశారు. ఒక చేత్తో ఇస్తూ ఇంకొక చేత్తో లాక్కుంటున్నారు. అమరావతి రాజధానిగా అవసరం లేదు కానీ అమరావతి రాజధాని పేరుతో పెట్రోల్, డీజిల్ మీద వసూలు చేసే సెస్ (అదనపు పన్ను) మాత్రం కావాలి. రోడ్లు వెయ్యరు, బాగు చెయ్యరు కానీ వాటి పేరు మీద పెట్రోల్, డీజిల్ లో సెస్ వసూలు చేస్తున్నారు. పక్క రాష్ట్రాలలో పెట్రోల్, డీజిల్ ధరలతో పోలిస్తే మన రాష్ట్రంలో 10 రూపాయలు ఎక్కువ.

పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఆపేశారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్ని మూసేశారు. ఆ విధంగా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. ఉద్యోగాలు వరవడి ఉంటుంది. ప్రతి ఏడాది జనవరి 1 తేదీన జాబ్ క్యాలెండర్ ఇస్తాము. 2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన జగన్ రెడ్డి గారు మూడేళ్లు గడుస్తున్నా ఒక్క క్యాలెండర్ కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలో గానీ, రాష్ట్ర ప్రభుత్వంలో గానీ PRC ఇస్తే జీతాలు పెరుగుతాయి. కానీ మన రాష్ట్రంలో మాత్రం జీతాలు తగ్గుతాయి. అదేంటో ఎవ్వరికీ అర్థం కాదు. అడిగితే ఇప్పటికే ఎక్కువ ఇస్తున్నామని బెదిరింపులు. నేను అధికారంలోకి వచ్చిన వారం లోనే CPS రద్దు చేస్తాను అని చెప్పిన జగన్ రెడ్డి గారు మూడేళ్లు అవుతున్నా దాని ఊసే లేదు. పైగా CPS రద్దు హామీ ఇచ్చేటప్పుడు దాని మీద నాకు అవగాహన లేదని యూ టర్న్ తీసుకోవడం హాస్యాస్పదం. రాష్ట్రంలో సిమెంట్, స్టీల్ రేట్లు పెంచేసి ఇసుక విషయంలో సరైన నిర్ణయం తీసులోకుండా 75 లక్షలమంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసి రోడ్డున పడేలా చేశారు. ఉప్పు నుండి పప్పు దాకా, పెట్రోల్, డీజిల్ అన్నీ ధరలు పెంచేశారు. విద్యుత్తు ధరలు పెంచారు. స్లాబ్స్ మార్చారు, ఇంటి పన్ను దగ్గర నుండి టాయిలెట్ పన్నులు కూడా వేయడం మొదలు పెట్టి సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

పక్క రాష్ట్రాల తో పోలిస్తే మన రాష్ట్రం లో అన్నీ ధరలు ఎక్కువ. శాంతి భద్రతల విషయంలో రాష్ట్రం అట్టడుగున ఉంది. దానికి జాతీయ సంస్థలు ఇచ్చే గణాంకాలే నిదర్శనం. హత్యలు, మానభంగాలు సర్వసాధారణం అయిపోయాయి. మానభంగం జరిగితే చట్టబద్ధంగా బాధితులకు వచ్చే పరిహారాన్ని ఇచ్చేసి, మేము న్యాయం చేసామని చెప్పుకోవడం హాస్యాస్పదం. అవి చట్టపరంగా బాధితులకు రావాల్సినవి. నిందితులకు మాత్రం శిక్ష పడటం లేదు. సుగాలి ప్రీతి లాంటి వారికి న్యాయం ఎక్కడ జరిగింది? పరిశ్రమల నుండి విషవాయువులు వచ్చి చాలామంది చనిపోతే, వారికి డబ్బులిచ్చి అంతా అయిపోయింది అనుకుంటే చాలా తప్పు, న్యాయం చెయ్యడం అంటే బాధితులకు డబ్బులు, ఉద్యోగం ఇవ్వడం కాదు నిందితులకు శిక్ష పడటం. ఆ తప్పు మరలా జరగకుండా చూడడం.

జగన్ రెడ్డి గారి ఆర్థిక విధానాలు చాలా ఘోరంగా ఉన్నాయి. ఈ మాట సాక్షాత్తు కాగ్ ( కంట్రోల్ అండ్ ఆడిటింగ్ జనరల్ ఆఫ్ ఇండియా) వాళ్ళు ఇచ్చిన రిపోర్టు. రాష్ట్ర అప్పులు దాదాపు 8 లక్షల కోట్లు, దొరికితే అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ, దొరక్కపోతే ప్రభుత్వ భవనాలు, పార్క్ లు తనఖా పెట్టి అప్పులు తీసుకొచ్చి నవరత్నాల పేరుతో ఓటు బ్యాంకింగ్ పథకాలకు ఇవ్వడం ఆర్థిక వ్యవస్థను చంపడమే. బడ్జెట్ లో పెట్టకుండా ఖర్చు చేయడం, కార్పొరేషన్ పేర్లతో అప్పులు చేయడం, కేంద్రం నుండి వచ్చే గ్రాంట్ లు మళ్ళించడం. అయితే తన పేరు లేకుంటే తండ్రి పేర్లు పెట్టుకుని పంచడం. ఇదేనా ఒక నాయకుడిగా చేయాల్సింది? స్వయంగా ఒక వ్యాపార వేత్త అయిన జగన్ రెడ్డి గారు రాష్ట్రాన్ని మాత్రం ఎందుకు పాతాళంలోకి నెడుతున్నారు? 2004లో అప్పుల్లో ఉన్న జగన్ రెడ్డి గారు 2009 చివరికి వేలకోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని అభివృద్ధి చేసినట్లు రాష్ట్రాన్ని మాత్రం ఎందుకు అప్పుల్లో ముంచుతున్నారు అన్నది ఆయనే చెప్పాలి.

రోడ్డు పక్కన టీ అమ్ముకునే వాళ్ళు కూడా డిజిటల్ పేమెంట్ లు వాడుతుంటే కొన్ని వేల కోట్లు వ్యాపారం అయిన మద్యం దుకాణాల్లో ఎందుకు డిజిటల్ పేమెంట్ లు పెట్టలేదు? పైగా ప్రభుత్వమే ఆ మద్యాన్ని అమ్ముతున్నది కూడా. పారదర్శకత ఎక్కడ? చెప్పుకుంటూ పోతే ఒకటా రెండా కోకొల్లలు. నిజమైన నాయకుడికి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే అభిమతంగా ఉంటుంది. అధికారం కోసం ఓట్ల కోసం ఓటర్లను ఆకట్టుకునే పథకాలు పెట్టి ఒకచేత్తో నేరుగా ఇచ్చి, ఇంకో చేత్తో వారికే తెలియకుండా లాక్కోవడం రాజకీయ నాయకుడి లక్షణం. ఈ లక్షణాలు జగన్ రెడ్డి గారు పుణికి పుచ్చుకున్నారు. ఏ రాష్ట్రానికైనా, దేశానికైనా మౌలిక సదుపాయాలు చాలా అవసరం. రైల్వే వారు కొత్త రైల్వే లైన్ వేస్తాము, రాష్ట్రం నుండి మీ వాట మీరు ఇవ్వండి అని అడిగితే ఇవ్వలేను దుస్థితిలో ఉంది ఆంధ్రప్రదేశ్. విశ్వవిద్యాలయ నిర్వహణ, జీతాల కోసం డిపాజిట్ చేసిన డబ్బును కూడా రాష్ట్ర ప్రభుత్వం మళ్ళించడం ఎక్కడ చూడనిది. అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాలంటే నిజాయితీగా, నిబద్ధత ఉన్న నాయకులు అవసరం. కేవలం అధికారం కోసమే ప్రాకులాడే వారిని ఎన్నుకుంటే పాలన ఇలానే ఉంటుంది. ఆర్థికాభివృద్ధి లేని సంక్షేమం ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో పవన్ కళ్యాణ్ లాంటి, నిబద్ధత, నిజాయితీ ఉన్న వారు రాష్ట్రానికి అత్యంత అవసరం. ఇసుక పాలసీ వలన 75 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడితే డొక్కా సీతమ్మ పేరుతో అన్నం పెట్టాడు. కరోనా విలయతాండవం చేస్తున్న తరుణంలో 800+ ఆక్సిజన్ సిలిండర్లు ఆయన పేరు మీద విరాళం ఇచ్చారు. ఇప్పుడు కూడా 3000 వేల మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుని చనిపోతే వారికి 30 కోట్లు పైగా సినిమాల ద్వారా సంపాదించిన డబ్బుతో సాయం చెయ్యడం అనేది గొప్ప విషయం. ఓ ప్రభుత్వం చేయని పని ఓ వ్యక్తి చేస్తున్నాడు, అలాంటి వ్యక్తికి అధికారం ఇస్తే ఇంకెంత చేస్తారో అనే విషయం ఆలోచించాలి. తనతోపాటు నడిచే క్రియాశీలక కార్యకర్తలకు సొంతంగా 5 లక్షలు భీమా చేస్తున్నాడు. కార్యకర్తల విషయంలోనే ఇంత భరోసా ఇస్తూ ఆలోచించే వ్యక్తి రాష్ట్ర ప్రజల గురించి ఎంత ఆలోచిస్తాడు. ఎంత చేయగలడో ఆలోచించుకోవాలి.

#Written By

ట్విట్టర్ ఐడి : @BhagathChegu

# రాజకీయ రామాయణం

శిష్యుడు వచ్చేసరికి గురువుగారు టీవీలో సీతారామ కల్యాణం ప్రత్యక్ష ప్రసారం చూస్తున్నారు. శిష్యుడు వచ్చి గురువుగారికి నిశ్శబ్దంగా నమస్కరించి వినయంగా కూర్చున్నాడు.

''దారా... రాములోరి పెళ్లయిపోయాక మనం రామాయణం చెప్పుకుందాం. సరేనా?'' అన్నారు గురువుగారు.

శిష్యుడు నీళ్లు నమిలి, ''ఎందుకులెండి గురూగారూ! మీరు కల్యాణం చూడండి. ఇవాల్టికి పాఠం వద్దులెండి'' అన్నాడు.

''భలేవాడివిరా! రామాయణాన్ని మించిన పాఠం ఏముంటుంది చెప్పు...''

''అవుననుకోండి. కానీ, మన రాజకీయాలకీ రామాయణానికీ పొంతన కుదర్దని...''

''వార్నీ... రామాయణమంటే వయసు మళ్లాక చదువుకునే పురాణమనుకుంటున్నావేంట్రా? జీవితంలో దేనికైనా అందులో పాఠం ఉంటుంది, పరిష్కారం కూడా ఉంటుంది...''

''ఊరుకోండి గురూగారూ! మీరు దేన్నుంచి దేనికైనా ముడి పెట్టేయగలరు కానీ...ఇప్పటి అరాచక రాజకీయాలెక్కడ? అప్పటి ఆదర్శవంతమైన రామరాజ్యమెక్కడ?''

''ఒరే... నేర్చుకోవాలనే బుద్ధి ఉండాలే కానీ, ఎందులోనైనా పోలిక కనిపిస్తుందిరా బడుద్ధాయ్...''

''ఇక మీరు వదిలేలా లేరని అర్థమైంది గురూగారూ. మరైతే మీరే చెప్పండి, ఇవాళ మన పరగణాలో జనం పడుతున్న బాధలకి రామాయణంలో ఎలాంటి పోలిక ఉందో?''

''అలాగన్నావ్ బాగుంది. ఇప్పుడు నేను చెప్పడం కాదురా, నీ చేతే చెప్పిస్తాను చూడు. రాముడికి సీత దూరమై అన్ని కష్టాలు పడడానికి కారణమేంటి?''

''ఏముందండీ... మారీచుడి మాయ వల్లండి...''

''మరదే పోలిక. మారీచుడేం చేశాడు? బంగారు లేడిలాగా కనిపించి మురిపించాడు. ఆశలు కల్పించాడు. సీత ముచ్చటపడిపోయింది. అప్పటికీ లక్ష్మణుడు హెచ్చరించాడు కూడా, బంగారు లేడి కనీ వినీ ఎరుగని వింత, ఇదంతా రాక్షస మాయ అని! సీత వినలేదు. మరి తర్వాత ఏమైంది? లంకలో బందీ అయిపోయింది. అవునా?''

''ఇదంతా నాకూ తెలుసు గురూగారూ! కానీ ఆ లంకకి, మనకి లంకె ఏంటా అని...''

''మరిక్కడ కూడా జరిగిందిదే కదరా? రాజకీయ రావణాసురుడు మారువేషంలో వచ్చాడు. బంగారు రాజ్యం తెస్తానంటూ ఆశలు చూపించాడు. బతుకులు మార్చేస్తానన్నాడు. సాధ్యం కాని హామీలు గుప్పించాడు. జనం పాపం... ముచ్చటపడ్డారు. మారీచుడి మాయ లాంటి ఆశల వలలో చిక్కుకున్నారు. ఇప్పుడు లంకలో సీతలా విలవిలలాడుతున్నారు. అవునా?''

''నిజమేనండోయ్. భలే పోలిక చెప్పారు. పాపం... సీతకి అటు బంగారు లేడీ దక్కలేదు, ఇటు భర్తకీ దూరమైంది. రాక్షస మూకల మధ్య నిస్సహాయంగా కుమిలిపోయిందండి...''

''మరి మన పరగణా ప్రజల పరిస్థితి కూడా అంతే కదరా? నమ్మిన హామీలు చూస్తే హంగామా తప్ప ఏమీ లేదనిపిస్తున్నాయి. చుట్టూ చూస్తే రాకాసుల్లాంటి నేతలు, అనుచరులు, వాళ్ల అరాచకాలూను. ఊ అంటే తప్పు. కాదంటే ముప్పు. అడిగితే అగచాట్లు. అదేమంటే అరాచకాలు. ప్రశ్నిస్తే పీచమణచడాలు. లంకలో సీతమ్మలా తల్లడిల్లిపోవడం లేదూ?''

''అవునండి బాబూ. నీకిక నేనే దిక్కని సీతమ్మని ఆ రావణాసురుడు బెదిరించినట్టే, ఈ రాజకీయ రావణాసురుడు కూడా విర్రవీగుతున్నాడండి. తననే మళ్లీ ఎన్నుకోవాలని మళ్లీ మాయమాటలు చెబుతున్నాడండి. ఆ సీత కథ రామబాణంతో తెరిపినపడిందండి. మరి ఇప్పుడీ జనం పరిస్థితి ఏంటండి పాపం?''

''వీళ్లని గట్టెక్కించేది కూడా రామబాణమేరా. కానీ అదిప్పుడు వీళ్ల చేతుల్లోనే ఉంది...''

''ఏంటండదీ?''


''ఓటురా. జనం చేతిలో ఓటే రామబాణంలాంటిది. దాన్ని సరైన సమయంలో సరైన పద్ధతిలో ప్రయోగిస్తే సరి. రాజకీయ రావణాసురుడి చెర వదిలిపోతుంది. రాక్షస మూకల బాధ తీరిపోతుంది...''

''బాగుంది గురూగారూ. కానీ నాకో సందేహమండి. ఇంతకీ రాముడెవరండీ?''

''రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుందని అడిగాట్ట వెనకటికి నీలాంటోడే. సరైన నాయకుడే రాముడురా. లంకలో సీత రాముడి కోసం తపించినట్టే, జనం కూడా అలాంటి నాయకుడు ఎవరో పోల్చుకోవాలి. ఆడి తప్పని వాడు, ఆపదల్లో అండగా నిలిచేవాడు, ఆవేశాన్నే ఆయుధంగా మలిచేవాడు, అడుగడుగునా నేనున్నానని నిలిచేవాడు ఎవడో అతడే ఆ నాయకుడు. మళ్లీ మాయ మాటల మారీచుడి వలలో పడకూడదు. లంకలో రావణాసురుడెలా ప్రలోభపెట్టాడో తెలుసుకదా? నా చెయ్యి పట్టుకుంటే పట్టపురాణిని చేస్తానన్నాడు. సర్వ సుఖాలూ నీవేనన్నాడు. దేవతలు సైతం తననేమీ చేయలేరన్నాడు. ఆ రాముడికి రాజ్యం కూడా లేదని ఎద్దేవా చేశాడు. దేశదిమ్మరన్నాడు. లంక దాకా రానేలేడన్నాడు. అయినా సీత విందా? లేదుకదా, అంతటి రావణుడిని కూడా గడ్డిపరకలా చూసిందా, లేదా? అదిగో అలాంటి స్థిర నిశ్చయానికి రావాలి. అప్పుడే మరి రాక్షస రాజ్యం నుంచి విముక్తి. అర్థమైందా?''

''అవునండోయ్. దురహంకారం, దౌర్జన్యం, కక్ష, కావేషం, ధన దాహం, అరాచకం, అధికార దుర్వినియోగం, పదవీ వ్యామోహం, అన్యాయం, తెంపరితనం... ఇవన్నీ రాజకీయ రావణాసురుడి పది తలలని గ్రహించాలండి. అధికారం, మందీమార్బలం, పటాటోపం, హంగు, ఆర్భాటం, మాయ మాటలు, ఆచరణ సాధ్యం కాని హామీలు, ప్రలోభాలు... ఇవన్నీ అరచేతిలో వైకుంఠం చూపించే రాక్షస మాయల్లాంటివని జనం తెలుసుకోవాలండి. వీటికి ఆకర్షితులు కాకుండా రామబాణాన్ని ప్రయోగించాలండి. అప్పుడిక రాబోయేదంతా రామరాజ్యమేనండి. అంతే కదండీ?''

''సెభాష్‌రా. రామాయణం అనగానే వెళ్లొస్తానన్నవాడివి, ఇప్పుడు చూశావా, ఎంత బాగా చెప్పావో? మొత్తానికి నీకు రాజకీయ రామాయణం అర్థమైందిరా. ఇక దాన్ని పారాయణం చేసుకో. పైకొస్తావ్. ఇక పోయిరా''



-సృజన

- జనసేన అస్త్ర ఆప్

## నారీస్వరం

# సంక్షోభం దిశగా ఆంధ్రప్రదేశ్

ఒక రాష్ట్ర మనుగడకు, కార్యకలాపాల నిర్వహణకు, ప్రభుత్వం హామీ ఇచ్చిన పథకాల అమలు కొరకు ప్రతి వ్యవస్థ అనుసంధానం అయి నడిపించే ఆర్థిక వ్యవస్థ పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్ అధికంగా అప్పులు చేస్తున్నది. సేవా రంగం ద్వారా వచ్చే ఆదాయం ప్రస్తుత ఆర్థిక అవసరాలను తీర్చే స్థితిలో లేదు. బడ్జెట్ ప్రకటించేటప్పుడు 2022 -23 ఆర్థిక సంవత్సరానికి 48 వేల కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయించి, ఆ మొత్తాన్ని 6 నెలల్లోనే తెచ్చుకున్న ఘనత మన రాష్ట్రానిది. ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వం చెపుతున్నా ఇది సాక్షాత్తు కాగ్ ఇచ్చిన నివేదిక.

ఒక ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన అప్పును 6 నెలల్లో తెచ్చారు ఇంకో 6 నెలల అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అడగటం, లేదా వేరే దారిలో అప్పులు తేవడం తప్ప వేరే గత్యంతరం లేదు. అభివృద్ధి చేసి చరిత్ర సృష్టించాలి కానీ అప్పులు కుప్పలుగా చేసి ఆర్థిక పరిస్థితిని పతనానికి చేర్చి చరిత్ర సృష్టిస్తున్నది. కేంద్రం నుండి వచ్చే ఆదాయపు వాటా, మన రాష్ట్రం నుండి వచ్చే ఆదాయం, నిరంతర ప్రహసనంగా అప్పులు, ఆదాయం పెంచుకునేందుకు ఎన్నో రకాల పన్నులు వేయటం, అన్ని రాష్ట్రాల తో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ లోనే డీజిల్, పెట్రోలు ధరలు ఎక్కువ, విద్యుత్ చార్జీలు, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు, మద్యం అమ్మకాలపై వచ్చే ఆదాయం గురించి ప్రత్యేకంగా చెప్పే అవసరం లేదు. ఆదాయం తగ్గుతుందని ఆదాయం పెంచేందుకు పన్నులు పెంచుతున్నామని నేరుగానే జీవోలు విడుదల చేస్తున్నారు అధికారులు ఎన్ని దారులు ఉంటే అన్ని విధాలుగా ఆదాయం రాబట్టుకొనే ప్రయత్నం ఓ పక్క చేస్తూనే ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తున్నారు. ఆర్బీఐకి అజమాయిషీ లేకుండా చేసే అప్పులు లెక్క లేవు ఎక్కడ దొరికితే అక్కడ అప్పులు తేవటం, వడ్డీ రేటు గురించి కూడా పట్టింపు లేదు. నవ్వి పోదురు గాని నాకేటి సిగ్గూ అన్నట్లు అప్పులు విషయంలో ప్రభుత్వ తీరు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న అప్పుల వల్ల ఆర్థిక వ్యవస్థ తో పాటు రాష్ట్రమే దివాలా తీసే పరిస్థితి లోకి వెళ్ళిపోతుంది. 6 నెలల్లో 29 వేల కోట్ల రూపాయల అప్పు చేశారంటే అది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సూచిస్తుంది. ఇంత పెద్ద మొత్తంలో అప్పులు తెచ్చి చేసిన అభివృద్ధి ఏమైనా ఉందా అంటే ఆనవాలు కూడా కనపడదు. సంక్షేమ పథకాల పేరుతో ఖాతాలోకి వేసారా అంటే అంత పెద్ద మొత్తం వేసిన పథకం లేదు. అవి కూడా వందల కోట్లలోనే లావాదేవీలు జరిగాయి.

రవాణా వ్యవస్థ రోడ్లు వేసింది లేదు, 3 రాజధానులు అని నోటి తో చెప్తున్న వాటి కొరకు ఏదైనా అభివృద్ధి చేసారా అంటే అదీ లేదు. నోటితో చెప్పి నొసటి తో వెక్కిరించినట్లు ఉంది అభివృద్ధి అనేది. రాష్ట్రాన్ని అప్పుల్లో నింపేయటమే పనిగా పెట్టుకున్నట్లుంది ముంచడమే కాదు ఆస్తుల్ని అడ్డంగా అమ్మేయడానికి బిల్డ్ ఏపీ అని ప్రోగ్రాం పేరు పెట్టి బారో ఏపీ ప్రోగ్రాం ప్రజా ఉపయోగంలో ఉన్న ఆస్తులన్నీ అమ్మడానికి వరుసగా ఏర్పాట్లు చేసుకుంటుంది. కోర్టుల్లో కేసులు ఉన్నా ఎవరైతే మాకేంటి అనుకునే ప్రభుత్వం అమ్మక మానదు. అంటే ఆస్తులు అమ్మేసి అప్పులు మిగల్చబోతున్నారు. సంపద లేని అప్పుల కుప్ప రాష్ట్రంగా ఏపీ మిగలబోతోంది. దాని పర్యవసానం రాష్ట్రం దివాలా తీయటమే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ ఎప్పుడూ వివాదంగానే ఉంటుంది. లెక్కల వివరణ సరిగా లేదని కాగ్ చెప్తుంది, ప్రభుత్వం ఈ విషయం పై మాట్లాడదు వేల కోట్ల నిధుల సేకరణ, ఖర్చు పై ఎలాంటి వివరణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వదు. ఎవరు ప్రశ్నించినా సమాధానం ఉండదు పైగా జవాబు చెప్పకుండా వ్యక్తిగత దూషణలు. కానీ కాగ్ ఇచ్చే నివేదికలోని లెక్కలు అబద్ధం కాదు పూర్తి వాస్తవాలు. అవసరానికి మించి అప్పులు, ఆదాయాన్ని మించిన ఖర్చులు ఎప్పుడూ ప్రమాదమే.

**- టీమ్ నారీస్వరం**

## అకాల వర్షాల వలన నష్టపోయిన అన్నదాత లకు నష్ట పరిహారం ఎక్కడ..?

**నెల్లూరు ( జనస్వరం )** : బిడ్డల బంగారు భవిత కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేన పార్టీ ఓటు వేసి నిస్వార్ధ నాయకుడైన శ్రీ పవన్ కళ్యాణ్ గారిని గెలిపించండి అంటూ..... సర్వేపల్లి నియోజకవర్గం బంద పాలెం లో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాలలో జలం ఉంటే సంపద ఉన్నట్లు భావిస్తారు. సముద్రపు ఒడ్డున ఉన్న ప్రాంతాలన్నీ వాణిజ్య సంపద తో నిండి ఉంటాయని అర్ధం. ఈ సర్వేపల్లి నియోజకవర్గం లో కేవలం కొన్ని కుటుంబాలు మాత్రమే సంపదతో నిండాయి. మిగిలిన వారందరూ పేదరికం అనుభవిస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించటం లో కానీ, ఆర్ బి కే కేంద్రాల లో తగిన ఎరువుల సరఫరా చేయలేక పోయారు. వ్యవసాయం



చేసే వారిలో ఎక్కువ ఉన్న కౌలు రైతులు అకాల వర్షాల వల్ల చేతికి వచ్చిన పంట నష్టపోయి అప్పులతో మునిగి పోయి ఆత్మహత్య చేసుకుంటుంటే పట్టించుకునే పరిస్థితి లేదు. దళారుల బారిన పడకుండా రైతులకు గిడ్డంగులు కల్పించటం లో విఫలమయ్యారు. అకాల వర్షాల వలన నష్టపోయిన అన్నదాత లకు నష్ట పరిహారం ఎప్పుడొస్తుందో,తడిసిన ధాన్యం ఎప్పుడు కొంటారు తెలియక రైతులు సతమతమవుతున్నారు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు సొంత సంపాదన నుంచి దాదాపు 30 కోట్ల రూపాయలు ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల ఇచ్చి పవన్ కళ్యాణ్ గారు భరోసాగా నిలిచారు. స్థానిక సమస్య ఏదైనా కానీ జనసేన పార్టీ తరపున జనసైనికులు పోరాటం జరిపేందుకు సిద్ధంగా ఉంటారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నిస్వార్ధ నాయకుడు పవన్ కళ్యాణ్ గారికి గెలిపించేందుకు గాజు గ్లాసు పై ఓటు వేసి జనసేన పార్టీని గెలిపించాల్సిందిగా మనవి చేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్ తో పాటు స్థానిక నాయకులు శ్రీపతి రాము, అశోక్, వెంకీ, హేమచంద్ర యాదవ్, ప్రశాంత్ గౌడ్, చిన్న రాజ, ప్రసన్న, శంకర్, మౌనేష్, తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య పరిష్కరించాలని జనసేన డిమాండ్ : ఎరుకుల పార్వతి

**నంద్యాల ( జనస్వరం )** : ఆలూరు మండలం చుట్టుపక్కల గ్రామాల్లో త్రాగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన వీర మహిళ ఏరుకుల పార్వతి అన్నారు. ఆలూరు మండలం చుట్టుపక్కల గ్రామాలు పరిస్థితి ఇలా ఉంటే మిగతా ఐదు మండలాల గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించాలని ఇక్కడ ఉన్న నాయకులను అధికారం మేము అడుగుతున్నాము అన్నారు. పది పదిహేను రోజులకు ఒకసారి త్రాగునీరు వదలడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. అధికారులు మాత్రం చుట్టపు చూపుగా చూసి వెళుతున్నారే తప్ప కానీ చుట్టుపక్కల గ్రామాలలో సమస్యలు అలాగే ఉండిపోయిందని రహదారులు డ్రైనేజీ తాగునీరు సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే నియోజకవర్గం నాయకులు అధికారులు మాత్రం చీమకుట్టినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. మట్టి రహదారులు అధ్వాన స్థితికి చేరుకుందని రహదారులపై గుంతలు కంకర రాళ్లు తేలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా అనారోగ్యానికి గురైతే బాలింతలు గర్భిణీ స్త్రీలు గ్రామాల్లో నుండి ప్రభుత్వ



ఆసుపత్రికి రావాలన్నా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నిండు గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆలూరు నియోజకవర్గం ఆరు మండలాల గ్రామాల పరిస్థితి ఇలా ఉంటే కర్నూలు జిల్లాలో మండలాల గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించాలని జనసేన వీర మహిళ ఎరుకుల పార్వతి అన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలపై స్పందించి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గం నాయకులను అధికారులను కోరుకుంటున్నానని అన్నారు.

## పెదమరికి పంచాయితిలో నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపించాలని జనసేన నాయకుల డిమాండ్

పార్వతీపురం ( జనస్వరం ) : పెదమరికి పంచాయితీలో ఇటీవల పెద్దయెత్తున నిధులు దుర్వినియోగం జరిగిన మాట అందరికీ విధితమే. అయితే,ఈ నిధులు దుర్వినియోగం విషయం పై, MPDO గారు గ్రామ సచివాలయంలో పంచాయతీ ప్రజల సమక్షంలో విచారణ చేపట్టి, రికార్డులు పరిశీలించగా అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించారు. తదుపరి కలెక్టర్ గారి ఆదేశాల మేరకు DLDO గారు కూడా ఈ విషయం గూర్చి రెండవసారి ప్రజలందరి సమక్షంలో విచారణ జరిపి, రికార్డులను పరిశీలన చేయగా నిధుల్ని దుర్వినియోగపరిచినట్లు వెల్లడించారు. అందుకు బాధ్యులైన పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్లు కూడా ప్రజలందరి ముందు నేరాన్ని ఒప్పుకున్నారు. ఇందు విషయమై పెదమరికి పంచాయతీ వైస్ సర్పంచ్,వార్డ్ మెంబర్లు,పెద్దలు,ప్రజలు అనేక పర్యాయాలు ప్రభుత్వ అధికారులు దృష్టికి, ప్రభుత్వ నాయకుల దృష్టికి తీసుకెళ్ళి, విన్నవించి ఈ నెలతో సరిగ్గా 4వ,నెల పూర్తివౌతుంది. కానీ,



సమస్యకు పరిష్కారం లభించకపోవడం శోచనీయం. నెలలు గతిస్తున్న జాప్యం జరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఇంకా ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకోకపోతే ప్రజలకు ప్రభుత్వ అధికారులపై, చట్టాలపై పూర్తిగా నమ్మకం కోల్పోయే అవకాశం ఏర్పడుతుందని జనసేన నాయకులు అన్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి అవినీతికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్లతో రికవరీ కట్టించి,వారిని విధులు నుండి తొలగించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా పలుమార్లు విజ్ఞప్తి చెయడం జరిగింది కానీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు కావున ఆ గ్రామ ప్రజలు జనసేన పార్టీని ఆశ్రయించడం జరిగింది ఈ రోజు స్పందన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు సమక్షంలో మరల వినతిపత్రం అందజేయడం ఆయితే కలెక్టరు సానుకూలంగా స్పందించి సంభవించిన అధికారి అయిన DlDO గారిని పిలిచి రెండు రోజుల్లో రిపోర్టు సమర్పించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు జరిగింది.. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మండల అధ్యక్షులు ఆగూరు మని, బొనెల గోవిందమ్మ, రాజాన బాలు, ఖాతా విశ్వేశ్వరావు, గుంట్రెడ్డి గౌరీశంకర్, చిట్లు గణేశ్, కర్రి మణికంఠ, బొండపల్లి జనార్ధన్ రావు పైల రాజు, దుర్గ, జనసైనికులు, వీర మహిళలు,పెద మరికి పంచాయతి ప్రజలు పాల్గొనడం జరిగింది.

## వినుతా కోటా చేస్తున్న నిరాహారదీక్షకు సంఘీభావం

**శ్రీకాళహస్తి ( జనస్వరం )** : కాళహస్తి ఇంఛార్జి కోటా వినుతా చిందేపల్లి గ్రామస్థుల కోసం చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష కు జనసేన పార్టీ నెల్లూరు జిల్లా పార్టీ తరుపున జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఇతర జనసేన నాయకులు కలసి సంఘీభావం



తెలపటం జరిగింది. స్వాతంత్రం పూర్వం వున్న అర్ అండ్ బీ రోడ్డు ను ఎటువంటి నోటీసు లు లేకుండా గ్రామస్థుల మద్దతు లేకుండా ఉన్న ఫలానా అడ్డంగ గోడ కట్టడం అమానుషం. వై సీ పీ నాయకుల అండదండలతో ప్రజాస్వామ్యం ను అవమాన పరుస్తూ కట్టిన ఈ గోడకు కు అధికారుల కాపు కాయటం దారుణం. కంపెనీ కోసం ఏర్పరిచిన ఈ రోడ్డు నుంచి వారి గ్రామం వెళ్లాలంటే నిర్మానుష్య ప్రదేశంలో 5 కి మీ లు నడిచి వెళ్ళాలి.. ఆడపిల్లలు గ్రామస్థులు ఈ దారి నుంచి వెళ్లాలంటే భయాందోళనల కు గురి అవుతున్నారు. ప్రాణం పోయినా ఈ గోడ ను అంగీకరించము అంటూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మా నాయకులు తోడుగా పెద్ద వయసు గల గ్రామస్థులు దీక్షలో పాల్గొన్నారని వారు తెలిపారు.

## అగ్నిప్రమాదంలో ఇళ్లు దెబ్బ తిన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం

**అమలాపురం ( జనస్వరం )** : బండారు లంకలో నిన్న జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ఐదు కుటుంబాలను జనసేనపార్టీ అమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు పార్టీ నాయకులతో కలిసి అగ్నికు ఆహుతైన



ఇళ్ళను పరిశీలించారు. జనసేనపార్టీ, తదేకం ఫౌండేషన్ వారి సహకారంతో తాత్కాలిక సహాయంగా ఒక్కో కుటుంబానికి 8 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ప్రభుత్వం తక్షణమే ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అదేవిధంగా వారి జీవనాధారమైన చేనేత మగ్గాలు కూడా అగ్నిలో ఆహుతి అయ్యాయని తక్షణమే వారికి చేనేత మగ్గాలు అందజేయడమే కాకుండా వారికి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ప్రభుత్వం 15 రోజుల్లో వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని అలాకాని పక్షంలో జనసేన ప్రత్యక్షంగా పూనుకుని బాధితుల ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తుందని రాజబాబు గారు అన్నారు ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు చిక్కాల సతీష్, బట్టు పండు, పిండి రాజా, కుంపట్ల రమేష్, ముత్తబత్తుల శ్రీను, తూము రమేష్, పొనకల ప్రకాష్, అరళ్ళపల్లి దుర్గ, బండి మణికంఠ, తులా సతీష్, తులా కృష్ణ, కొప్పుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకోట పంచాయతీలో యువత సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జనసేన నాయకులు డా. విశ్వక్ షేన్

**ఎచ్చర్ల ( జనస్వరం )** : ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన నాయకులు, రాష్ట్ర కార్యనిర్వహణ వైస్ ప్రెసిడెంట్ డా.విశ్వక్షేన్ కొత్తకోట పంచాయతీలో ఉన్న యువతని కలిశారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను మన ప్రభుత్వం



అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరించుదాం అని మాట ఇచ్చారు. రాబోయే రోజుల్లో జనసేనపార్టీ అభివృద్ధి కోసం కష్టపడాలని, ఇప్పటి నుండే ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఒక్కసారి జనసేన వైపు చూడండి పవన్ కళ్యాణ్ గారి కి ఒక్క అవకాశం ఇవ్వండి. అని ప్రజలను అడగటం జరిగింది. పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. అనంతరం కొత్తకోట పంచాయతీ జనసైనికుడు టిఫిన్ షాపు పెట్టడం జరిగింది. డా.విశ్వక్షేణ్ ఆహ్వానించి రిబ్బన్ కటింగ్ చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసైనికులు, గ్రామ యువత పాల్గొన్నారు.

## మహిళా సాధికారత కోసం జనసేన పార్టీ ఎప్పుడు ముందు ఉంటుంది : లోకం మాధవి

**నెల్లిమర్ల ( జనస్వరం )** : పూసపాటిరేగ మండలంలోని పేరాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న మహిళల దగ్గరికి వెళ్లి వారితో మాట్లాడిన లోకం మాధవి. ఆమె మాట్లాడుతూ మిగతా పార్టీలలా జనసేన పార్టీ హామీలు ఇచ్చి పబ్బం గడిపే పార్టీ కాదు అని ఇచ్చిన హామీని కచ్చితంగా అమలుచేసి తీరుతుందన్నారు. ఈ రోజు ప్రజలు అంటే ఎంతో గౌరవం మరియు నిబద్ధత కలిగి ఉన్న ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ గారు ఒక్కరే అని, వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభుత్వ స్థాపకి కృషి చేయాలి అని అక్కడ ఉన్న ప్రజలను లోకం మాధవి కోరారు. అలాగే జనసేన మేనిఫెస్టో లో మహిళల కోసం వారి అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన హామీలని వారికి తెలిపారు. వారి ఊరి సమస్యలు అడుగుతుండగా అక్కడ ఉన్న మహిళ తను వితంతువు అయినా ఇప్పటికి తనకి పెన్షన్ రాలేదని ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగిన



ఉపయోగం లేకుండా పోయింది అని వాపోయారు. సమస్య విన్న మాధవి గారు ఆమె తరపున పోరాటం చేస్తాం అని భరోసా కల్పించారు. రాజకీయాలలోకి రావటానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్ గారి సిద్దాంతాలు మరియు ప్రజలకి ఈ ప్రాంతానికి మంచి చేయాలి అన్న తపనే నని ఈ సారి వచ్చే ఎన్నికల్లో జనసేన కి మద్దతు తెలియజేయాలని కోరారు.

## వాపు ను చూసి బలుపు అనుకుంటున్న టీడీపీకి ప్రజలే బుద్ది చెబుతారు : రేగిడి లక్ష్మణరావు

**విజయనగరం ( జనస్వరం )** : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున అభ్యర్థిని పెట్టకపోవడంతో టీడీపీ గెలిచిందని టిడిపి నాయకులు గంట శ్రీనివాసరావు గారు చెప్పడం జరిగిందని అన్నారు. అలాంటప్పుడు టీడీపీ నాయకులు కునా రవికుమార్ ఏ విధంగా జనసేన పార్టీని తక్కువ చేసి మాట్లాడుతారని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని జనసేన పార్టీ విజయనగరం జిల్లా ప్రచార కార్యదర్శి రేగడి లక్ష్మణరావు ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ మీరు మాకు సీట్లు ఇవ్వడం ఏంటి? మేమే మీకు సీట్లు ఇస్తాం 20, 30 ఈసారి కచ్చితంగా జనసేన పార్టీ 2024 అధికారంలోకి వస్తుందని అన్నారు. పవన్ కళ్యాణ్ గారిని సీఎంగా చేయాలనే ధ్యేయంగా జనసేన పార్టీ కార్యకర్తలు, మహిళలు పని చేస్తున్నారు. టిడిపితో మాకు పొత్తు అవసరం లేదు, మీరాడే మైండ్ గేమ్ పవన్ కళ్యాణ్ గారికి మొత్తం తెలుసు. ఒక్కసారి వారాహితో రోడ్డు



మీదకు వస్తే ఎవరు బలము ఏంటో తెలుస్తుందన్నారు. ఆరు శాతం నుండి 30% కి పెరిగిన జనసేన పార్టీ బలం. మాకు ఎవరు దయ దక్షిణాల అవసరం లేదు. టిడిపి తో పొత్తు కేవలం ఒక ఆప్షన్ మాత్రమే. టిడిపి అవసరం మాకు లేదని మా అవసరం టిడిపికి మాత్రం ఉందని గ్రహించుకోవాలని హెచ్చరించారు. ఇంకోసారి కునా రవికుమార్ తప్పుడు మాటలు మాట్లాడితే రాజకీయ జీవితం లేకుండా చేస్తామని హెచ్చరించారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలి



**తణుకు ( జనస్వరం )** : తణుకు నియోజకవర్గం తణుకు మండలం ముద్దాపురం గ్రామంలో గవర్నమెంట్ స్కూల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అతి దారుణంగా ధ్వంసం చేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని పాడు చేయడం అనేది చాలా బాధాకరమని దీనికి బాధ్యులైన వారిని ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని ఇటువంటి విషయాలు భవిష్యత్తులో జరగకుండా దోషులను కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## గాజువాకలో వైసీపీ, టీడీపీల నుంచి మహిళామణులు జనసేనపార్టీలో చేరిక



**గాజువాక ( జనస్వరం )** : గాజువాకలోని పలు వార్డుల నుంచి 40 మంది వివిధ మహిళాసంఘాల కార్యదర్శులుగా మరియు అధ్యక్షులుగా పనిచేసిన మహిళలు జనసేనపార్టీలోకి జాయిన్ అయ్యారు. గాజువాక నియోజకవర్గ జనసేనపార్టీ నాయకులు విందుల వెంకటరమణ గారి సారధ్యంలో శ్రీనగర్ యందు పార్టీ కార్యాలయంలో గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్ మరియు PAC సభ్యులు కోన తాతారావు గారి సమక్షంలో జనసేన పార్టీ లో చేరారు. అనంతరం పార్టీ కండువాతో కోన తాతారావు గారు మహిళలందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని స్పోచించారు. జనసేనపార్టీ సిద్దాంతాలను, పవన్ కళ్యాణ్ గారి ఆసాయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లెలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## రామ్ చరణ్ జన్మదిన సందర్భంగా విశాఖ పశ్చిమలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు



**విశాఖపట్నం ( జనస్వరం )** : విశాఖ పశ్చిమ నియోజకవర్గం, పారిశ్రామిక ప్రాంతం, 62వ వార్డులో, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ గారి పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ముప్పిన.ధర్మేంద్ర గారి సమక్షంలో ఉచిత కంటి వైద్య శిభిరం ఏర్పాటు చెయ్యటం జరిగింది. ఇందులో ప్రజలు పెద్ద ఏతున్న పాల్గొని కంటి పరీక్ష చేయించుకోవటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బ్లైండ్నెస్ కంట్రోల్ సొసైటీ వాలకి అలాగే Dr. రాజు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక జనసేన నాయకులు అయిన కరణం.కనకరావు, దుంగ.దేవన్ రాజు, మొజ్జాడి.చంద్రమౌళి, నగేష్, ప్రేమ్ కుమార్, వంశీ, తులసి రామ్, రాజేష్, శివ తదితరులు పాల్గొని ఈ యొక్క క్యాంప్ ను విజయవంతం చేశారు.

## రైతుల సమస్యలను పరిష్కరించిన నెల్లిమర్ల జనసేన నాయకురాలు లోకం మాధవి

**నెల్లిమర్ల ( జనస్వరం )** : నెల్లిమర్ల మండలం చిన్న బురాడపేట గ్రామంలో గత మూడేళ్లుగా చెరువుకి గండి పడటం వలన సుమారు 60 మంది రైతులు పంట నష్టానికి గురైనారు. నిరుపయోగంగా ఉండి ఏమి చేయలేక సతమతమవుతుంటే కనీసం నియోజకవర్గ నాయకులు కానీ, ప్రభుత్వ యంత్రాంగం కానీ రాష్ట్ర నాయకులు కానీ ఎవరు స్పందించక బాధపడుతుంటే వాళ్లతో మాట్లాడి వాళ్లకి చేయూతనివ్వాలని నెల్లిమర్ల జనసేన నాయకురాలు లోకం మాధవి ఆలోచించారు. ఆ ప్రాంతాన్ని ఆదివారం లోకం మాధవి పరిశీలించి వెంటనే జేసీబీ ని పిలిచి అక్కడ పనులను ప్రారంభించమని చెప్పారు. అలాగే అక్కడ రైతులు చెబుతున్నట్టు సుమారు 385 ఎకరాల పొలానికి కనీస రహదారి కానీ, కనీసం రవాణా సౌకర్యం లేదు అని, వారు ఎరువులు కానీ పంట కానీ నెత్తి మీద మోసుకొని సుమారు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్ళవలసి వస్తుందని రైతులు వాపోయారు. కనీసం రహదారి మీద కూడా నాయకులు నుండి ఎటువంటి స్పందన లేదని వారిని కనీసం పట్టించుకోవట్లేదని రైతులు చెప్పారు. రెవిన్యూ డివిజన్లో మార్పు వల్ల ఆ సమస్య ఇంకా పెద్దదైనది కానీ సమస్య ఓ కొలిక్కి రాలేదు అని రైతులు లోకం మాధవితో చెప్పారు. దీని పైన తను తప్పకుండా సమిష్టిగా రైతు సమస్యలను పరిష్కరించుకుంటూ, జనసేన పార్టీ ఎప్పుడు రైట్లుకి అండగా ఉంటాదని అని లోకం మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లాన శ్రీనివాస్, పతివాడ శ్రీనివాస్, కోట్ల ధనంజయ్ తదితరు నాయకులు పాల్గొన్నారు.





## నెల్లూరు సిటీలో అనిల్ కుమార్ కి సరైన బుద్ధి చెప్పండి : గునుకుల కిషోర్

**నెల్లూర్ ( జనస్వరం ) :** 45 వ డివిజన్ శ్రీనివాస అగ్రహారం వద్ద ఇల్లు కట్టించిన తర్వాతే కాళీ చేయండి అని ఎం ఎల్ ఏ చెప్పిన మూడు రోజుల లోనే ఇల్లు కూల్చిన సందర్భంగా జనాసేన నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు కట్టించిన తర్వాతే మీరు కాళీ చేయించండి అని మాట ఇచ్చి ఎం ఎల్ ఏ మాట తప్పారు. మాట తప్పటం మడిమ తిప్పటం వై సీ పీ కి అలవాటే. సాయంత్రం 6 గం పైన ప్రజలను అశక్తులను చేసి వీధిన పడేశారు ఆ సమయంలో పగలగొట్టి చట్టరీత్యా నేరం అని తెలిసినా అధికారులు స్థానికులు పై దురుసుగా ప్రవర్తించటం అమానుషం. మాయ మాటల తో ప్రజలను మోసం చేయలేరు.. ఎలాగూ అనీల్ నెల్లూరు జిల్లా లో వుండే అవకాశం లేదని చెప్పకుండానే చెప్పారు. తన నియోజక వర్గంలో ఉన్న అసమ్మతి చూసుకోకుండా పక్క 3 నియోజక వర్గాల్లో వై సీ పీ గెలవక పోతే జిల్లా లో కనపడను అని ప్రతిజ్ఞ చేస్తున్నారు. కాబట్టి ఆయనకు ఎవరూ ఓటు వేయనవసరం లేదు. మన వాడే అనుకుని గెలిపించిన ప్రజలను మొన్న కిసాన్ నగర్ ఈ రోజు ఇక్కడ అనాలోచితంగా ప్రజలను వీధికి లాగుతున్నారు. సామాన్యులకి అండగా నిలబడ గలిగిన నాయకుడు పవన్ కళ్యాణ్ గారి ఒక్కరే ఈ సారి జనసేన కు అవకాశం ఇవ్వల్ని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ జనసేన తరపున పోరాడుతామని అనీల్ ఇప్పటికైనా స్పందించి నిరాశ్రయులకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో కిషోర్ తో ప్రశాంత్ గౌడ్, షాజహాన్, శరవణ, మౌనీశ్, ప్రసన్న పాల్గొన్నారు.



## మత్స్యకారులకి వెంటనే పక్కా గృహాలు కట్టించాలని డిమాండ్ చేసిన లోకం మాధవి

**నెల్లిమర్ల ( జనస్వరం ) :** భోగాపురం మండలంలోని ముక్కాం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ముక్కాంలో అధికంగా మత్స్యకార కుటుంబాలు నివసిస్తుంటారు. వీరిలో ఎక్కువ మందికి పూరి గుడిసెలు ఉండటం గమనార్హం, ఉదయం ఓ పూరి గుడిసె తగలబడుతుండటం చూసిన జనసైనికులు వెంటనే స్పందించి ఆ మంటలను ఆర్పడం జరిగింది. దీనిలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న నెల్లిమర్ల నియోజకవర్గ నాయకురాలు లోకం మాధవి గారు ఆ ప్రదేశానికి విచ్చేసి బాధితులని పరామర్శించారు. లోకం మాధవి గారు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం 2019 ఎలక్షన్ల నాడు మత్స్యకార కుటుంబాలకి పక్కా ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే తుంగలోకి తొక్కేసారని మండిపడ్డారు. గత కొంతకాలంగా నియోజకవర్గంలో ఎన్నో అగ్నిప్రమాదాలు సంభవించాయని, వాటిని నిర్మూలించేలా నియోజకవర్గ నాయకులు కానీ ప్రభుత్వ యంత్రాంగం కానీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని, కనీసం అగ్నిమాపక సిబ్బంది వారు



కూడా స్పందించటం లేదు అని తెలిపారు. మత్స్యకారులు ఎంతో కష్టపడి దాచిపెట్టుకున్న సొమ్ముని వారి గుడిసెల్లో పొందుపరచుకుంటే ఇలాంటి అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు కష్టార్జితం మొత్తం అగ్గిపాలవటం చాలా బాధాకరమైన విషయం అని తెలియజేశారు. ఈ సమస్య పైన తమ వైపు నుండి భవిష్యత్తు కార్యచరణ ఉంటుందని ఈ అగ్ని ప్రమాదాలు నిలువరించేలా, మత్స్యకారులకి పక్కా ఇల్లు కట్టేలా తమ పోరాటం ఉంటుందని లోకం మాధవి గారు తెలిపారు.

## నిబంధనల మేరకే ఇసుక రీచును నడపాలి : జనసేన నాయకుడు అతికారి దినేష్

**సిద్దవటం ( జనస్వరం ) :** మండలంలోని జంగాలపల్లి గ్రామంలోని ఇసుక రీచును నిర్వాహకులు నిబంధనల మేరకు నడపాలని జనసేన నాయకుడు అతికారి దినేష్ స్పష్టం చేశారు. మండలంలోని జంగాలపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగాలపల్లిలోని ఇసుక రీచును నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ప్రజల వైపునుంచి జనసేన ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇసుక రీచు వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్ళు పోయిన బాదితురాలికి ఆర్థిక సహాయం అందిస్తే సరిపోదని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చెయ్యాలన్నారు. ఇసుక రీచు నుంచి వెళ్లే వాహనాలు ఎక్కువ టన్నేజ్ తీసుకెళ్తుండడంతో రోడ్లు దెబ్బతిన్నాయని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జంగాలపల్లి రోడ్డు ప్రమాద బాదితులకు



ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటుగా సిద్దవటంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో గాయపడ్డ సలీం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## చిత్తూరు నియోజకవర్గంలో జనబాట కార్యక్రమం

**చిత్తూరు ( జనస్వరం ) :** చిత్తూరు నగరంలోని 19వ వార్డులో జనసేన జనబాట కార్యక్రమం మూడవ రోజు చిత్తూరు నగర ఉపాధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో కొనసాగింది. జనసేన శ్రేణులు గడప గడపకు తిరుగుతూ పార్టీ సిద్ధాంతాలు మరియు పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను ప్రజలకు వివరించడం జరిగింది. రానున్న రోజుల్లో జనసేన ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రోజు రోజుకి వైసీపీ ఆగడాలు ఎక్కువ అయ్యాయని, త్వరలోనే ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా



కార్యదర్శి దేవినేని యశ్వంత్, భానుప్రసద్. చిత్తూరు నగర ఉపాధ్యక్షులు రూపేష్, సీనియర్ నాయకులు పూల చందు, లోచన్, ప్రశాంత్, హరీష్, అరుణ్. వీర మహిళలు అంజలి, జయంతి, వనిత మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి జనసేన పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**హైదరబాద్ ( జనస్వరం ) :** కూకట్పల్లి అసెంబ్లీ పరిధిలోని కె.పి.హెచ్.బి రమ్య గ్రౌండ్ వద్ద తుమ్మల మోహన్ కుమార్, కొల్లా శంకర్ గారి ఆధ్వర్యంలో 'చలివేంద్రం' ప్రారంభించడం జరిగినది. ఈ ఏడాది కూడా మండుతున్న ఎండల నుంచి ప్రజల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో సోమవారం తెలంగాణ జనసేన పార్టీ స్టేట్ ఇంచార్జ్ నెరుమూరి శంకర్ గౌడ్, మండలి దయాకర్ కావ్య గారు చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శ్రీ వేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారి సేవ స్ఫూర్తితో నిర్వహిస్తున్న చలివేంద్రా కేంద్రం నిర్వహిస్తూ ప్రజల యొక్క దావాగ్ని తీర్చుతున్న నాయకులు తుమ్మలమోహన్, కొల్లా శంకర్ మరియు జనసేన వీర మహిళలకు అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, ఆంజనేయులు, సత్యనారాయణ, నాగ చరణ్ , వెంకటలక్ష్మి మహాలక్ష్మి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## 15 వ వార్డ్ నేసేపేటలో చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సేవ్ ధర్మవరం కార్యక్రమం



**ధర్మవరం ( జనస్వరం ) :** సేవ్ ధర్మవరం కార్యక్రమం ధర్మవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో 15 వ వార్డ్ నేసేపేట లో నిర్వహించారు. పట్టు చీరల వ్యాపారస్తులు వారు తమ సమస్యలను చెప్పుకోగా వారి సమస్యలను తప్పకుండా తీరుస్తామని వారికి అండగా ఉండి ధర్మవరంలో పట్టుచీరల వ్యాపారాన్ని కాపాడుకుందామని వారికి హామీ ఇచ్చారు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబానికి జనసైనికుల ఆర్థిక సహాయం

**విశాఖపట్నం ( జనస్వరం ) :** మండల జనసేన నాయకులు బెల్లాపు నర్సింగరావు ఆధ్వర్యంలో గంభీరం పంచాయతీ బోయపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబానికి జన సైనికులు అండగా నిలిచి తమ వంతు సహకార అందించారు. బోయపాలెం



గ్రామానికి చెందిన పి అచ్చియమ్మ, ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా ఆ కుటుంబం నిరాశ్రయులు కావడంతో ఆనందపురం జనసేన నాయకులు ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ 14 వేలు నగదు, బియ్యం అందజేశారు ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలో లేకపోయినా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో కష్టకాలంలో ఉన్న వారిని తమవంతుగా ఆదుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు మజ్జి శ్రీను (ఎక్స్ ఆర్మీ) దుక్క వెంకటరావు, బెల్లపు నర్సింగరావు, సురేష్, సుబ్బు, మీసాల నాగేశ్వరరావు, తమ్మిన అప్పలరాజు, తోమురోతు అప్పలరాజు, ఆకుల శివ, శ్రీకాంత్, కళ్యాణ్, రెడ్డి, ఇతర జనసేన నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

## జగన్ కేసులు మాఫీ చేసుకునేందుకు ఢిల్లీ పర్యటనలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు : డా. మైఫోర్స్ మహేష్

**మదనపల్లి ( జనస్వరం )** : మదనపల్లి పట్టణంలోని గొల్లపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షారులతో కలుస్తూ కేసులకు సంబంధించిన లీఫ్ ల. ద్వారా రిలీఫ్ అవుతున్నారని ఎద్దేవా చేశారు. కేసులు మాఫీ చేసుకునేందుకు ఢిల్లీ పర్యటనలు తప్ప... రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా అడిగిన పాపాన పోలేదని వాపోయారు. విజయవాడ , విశాఖపట్నం మెట్రో రైల్ అడగలేదని , మదనపల్లి ,బెంగళూరు రైల్వే లైన్ అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శలు గుప్పించారు. బిజెపి ప్రభుత్వంతో ప్రత్యక్ష పొత్తు ఉండేది ఒక్క వైసీపీ పార్టీకే అని స్పెషల్ స్టేటస్ పై ప్రతిసారి పవన్ కళ్యాణ్ పై నిందలు వేయడం తగదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వంతో అన్ని విధాల సఖ్యతతో ఉన్నది ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే అని ఇప్పుడు కర్ణాటకలో జరగబోయే ఎన్నికలకు పెద్ద మొత్తంలో డబ్బులు పంపించి బిజెపి ప్రభుత్వాన్ని గెలిపించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్




రెడ్డి కృషి చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటివరకు కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన సొంత లాభం కోసమే ఢిల్లీ పర్యటన చేశారు తప్ప రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం కానీ రాష్ట్ర అభివృద్ధి కోసం కానీ, ఢిల్లీ పర్యటనలు చేసిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో పవన్ కళ్యాణ్ ఒక్కడే ముందు ఉన్నాడని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటు కణంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాని ప్రతిపక్ష ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం వెనుక వారు చేసిన అవినీతిలే కారణమని డాక్టర్ మై ఫోర్స్ మహేష్ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ అవినీతి రహిత పాలన అందించాలంటే అది ఒక్క పవన్ కళ్యాణ్ కి మాత్రమే దక్కుతుందన్నారు. రాష్ట్ర రాజకీయాలలో మచ్చలేని నాయకుడు పవన్ కళ్యాణ్ మాత్రమే అని ధీమా వ్యక్తం చేశారు. రాబోవు ప్రధాన ఎన్నికలలో పవన్ కళ్యాణ్ ని గెలిపించి ముఖ్యమంత్రిని చేసుకుంటే పార్టీని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు మల్లిక, శోభ, రూప, సునీత, జనసేన పార్టీ నాయకులు శ్రీనాథ్, గంగాధర, లక్ష్మీపతి, సోను, నాగేంద్ర, హర్ష, దేవా తదితర జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ఏలూరు నగరపాలక సంస్థ బడ్జెట్ లో ప్రజారోగ్యానికి ప్రాధాన్యతను ఇవ్వని పాలకమండలి : రెడ్డి అప్పలనాయుడు

**ఏలూరు ( జనస్వరం )** : ఏలూరు నగరపాలక సంస్థ ఇటీవల నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో వేల కోట్ల రూపాయల బడ్జెట్ కానీ ఎక్కడ బడ్జెట్ కు, ప్రజా ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు ఆరోపించారు..శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు..బడ్జెట్ సమావేశంలో చర్చించడానికి ప్రతిపక్ష కార్పొరేటర్లు గాని మాట్లాడకుండా పాలకమండలికి భజన బృందంగా మారారని అన్నారు. బడ్జెట్ పై మాట్లాడడానికి ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి అవకాశం ఇవ్వకుండా ఆయనను అగౌరవపరిచారని విమర్శించారు. అవగాహన కలిగిన ఎమ్మెల్సీకి కూడా బడ్జెట్ పై మాట్లాడడానికి, అవగాహన లేని కార్పొరేటర్లు,డిప్యూటీ మేయర్లు ఆయనను అనుమతించకపోవడం దారుణం అన్నారు. 7 వేల కోట్ల రూపాయల బడ్జెట్లో ఆరోగ్యానికి, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత నివ్వక పోవడంతో, రోడ్లపై చెత్త పేరుకుపోయి, డ్రైనేజీలలో మురుగు పేరుకుపోయి ఈగలు, దోమలు నగర ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు.. నగరంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీటి సరఫరాకు వందలు వెచ్చించారని, ఎక్కడ ప్రజలకు మౌలిక సదుపాయాలు




సక్రమంగా అమలు జరిగిన జాడలేదన్నారు. పరిపాలన చేతకాని వారు నగరపాలక సంస్థలో ప్రజా ప్రతినిధులుగా ఉన్నారని, వారందరూ పాలకవర్గ సమావేశానికి భజన పాటలు గా మారారని అన్నారు. ప్రజా సమస్యలు, ప్రజల కష్టాలు పరిష్కరించడంలో వారు విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న నగర పాలకులు, నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ ప్రజలకు జవాబు దారిగా ఉండి, ప్రజా సమస్యల పరిష్కరించకపోతే జనసేన పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా పాలకమండలి సమావేశంలో చర్చకు అనుమతించకుండా అవమానించిన షేక్ సాబ్జీకి క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

## దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అవినీతిని ఎండగట్టిన జనసేన నాయకులు కొఠారు ఆదిశేషు

**దెందులూరు ( జనస్వరం )** : దెందులూరు శాసనసభ్యులు కొఠారు.అబ్బయ్య చౌదరి గారు పలుమార్లు నియోజకవర్గ అభివృద్ధి గురించి ప్రగల్భాలు పలుకుతున్న తీరును ప్రశ్నించడానికి జనసేన పార్టీ, దెందులూరు నియోజకవర్గ నాయకులు కొఠారు ఆదిశేషు మీడియా సమావేశం ఏర్పాటుచెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా కొఠారు ఆదిశేషు మాట్లాడుతూ, MLA ఎన్నిక కాబడిన 4 సంవత్సరాలకు సుప్తావస్థ నుండి మేల్కొని ముఖ్యమంత్రి గారికి అన్న అది కావాలి అన్న ఇది కావాలి అని అడగడంలో అర్థం లేదన్నారు. ప్రజల సమస్యలు తీర్చే ఉద్దేశం ఉంటే తొలినాళ్ళ నుండే పట్టించుకోవాలి గాని మళ్ళీ ఎన్నికల దగ్గర పడేసరికి నిద్రలేచి హడావిడి చెయ్యడం సరికాదన్నారు. అబ్బయ్య చౌదరి గారు ఈ ప్రభుత్వం స్త్రీ పక్షపాత ప్రభుత్వం, మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తున్నారు అనడం హాస్యాస్పదని, అటువంటప్పుడు విజయరాయి జనసేన వీరమహిళ చిన్నమ్మ చేపలదుకాణం ఎందుకు దౌర్జన్యంగా తొలగించారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సభకు రాకపోతే మంజూరు చేసిన పథకాలు నిలిపివేస్తామని మహిళలను బెదిరించి తీసుకెళ్లారని, న్యాయంపల్లి గ్రామంలో అలా బలవంతంగా వెళ్ళిన మహిళ 3ఏళ్ళ పసికందుని ఇంట్లో వదిలివెళ్ళడం వలన ఆ పసికందు నీటితొట్టిలో పడి మృత్యువాత పడ్డాడు అని, ఆ కుటుంబానికి ఎవరు న్యాయం చేస్తారని ఇదేమి దౌర్జన్య పాలన అని ప్రశ్నించారు. వృత్తి నైపుణ్యం మీద అవగాహన తరగతులు ఎక్కడ జరుగుతున్నాయి??కుట్టు మిషన్లు, చిల్లర దుకాణాలు ఎలా మహిళసాధికారతో,




వాటి వల్ల జీవనప్రమాణాలు ఏవిధంగా పెరుగుతున్నాయో వివరించమని అన్నారు. అన్నా ఇది SC సామాజిక వర్గం ఎక్కువ ఉన్న నియోజకవర్గం అన్నా అని ముఖ్యమంత్రికి చెప్పిన అబ్బయ్య చౌదరి దెందులూరు నియోజకవర్గంలో వరుసగా అదే దళిత సామాజికవర్గ మహిళల మీద దాడులు జరిగినప్పుడు బాధ్యత ఎందుకు వహించలేదు అని తిట్టిపోసారు. 2 లక్షలకోట్లు సంక్షేమ పథకాలకు ఖర్చుపెట్టామన్న ప్రభుత్వం, దానిని అభివృద్ధి రూపంలో చూపించడంలో విఫలమైందన్నారు, ఆ ధనం అంతా ఎటు తరలించారో చెప్పమన్నారు. 4 సార్లు ఇసుక పాలసీని మార్చి మార్చి చివరికి వారు దోచుకునేలాగా రూపుదిద్దించికుని ప్రజల సొమ్ము దోచుకోవడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయం లేకుండా చేసారన్నారు. పోలవరం కాలువ 40కి.మీ మేర నియోజకవర్గంలో వెళుతున్నా రైతులకు ఒక్క చుక్క నీరు కూడా అందించే ప్రయత్నం కూడా చెయ్యకపోవడం శాసన సభ్యుడి పాలనా వైఫల్యం అని ఎద్దేవా చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని బాధితులను పరామర్శించి, సహాయం అందజేసిన గుడివాడ పట్టణ జనసైనికులు

**గుడివాడ ( జనస్వరం )** : గుడివాడ మండల న్యూజెల్ల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల షేక్ మస్తాన్ బి ఈల్లు పూర్తిగా కాలిపోవడంతో వారిని పరామర్శించి వారికి బియ్యం నిత్యవసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటిన గుడివాడ పట్టణ జనసైనికులు.ఈ సందర్భంగా గుడివాడ పట్టణ జనసేన నాయకులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ఆంధ్రుల అన్నపూర్ణ శ్రీమతి డొక్కా సీతమ్మ గారి ఆశీస్సులతో జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో మేము చేస్తున్న సేవా కార్యక్రమాలు భాగంగా ఈరోజు గుడివాడ మండల నూజిల్లా గ్రామంలో అగ్ని బాధితులను పరామర్శించి వారికి మా వంతు సహాయంగా బియ్యం నిచ్చోస్తుల సరుకులు మరియు ఆర్థిక సహాయం అందించి వారికి మేము ఉన్నామని భరోసా ఇవ్వడం జరిగింది. అదేవిధంగా గుడివాడ పట్నంలో అనేక సేవా సంస్థలు వారు ఉన్నారని వారు కూడా స్పందించి ఆదుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఇప్పటివరకు ఏ ప్రభుత్వ అధికారులు మరియు అధికారపక్ష నాయకులు పరామర్శించకపోవడం చాలా దారుణం అని ఆపదలో ఉన్న వాళ్ళకి సహాయం చేసినప్పుడే ఆ మానవత్వం నిలుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ మీరా షరీఫ్ గారు, నూనె అయ్యప్ప, చరణ్, చరణ్ తేజ, సురేష్, మరియు జనసైనికులు పాల్గొన్నారు



## బోయ వాల్మీకి ఇతర కులాలను ST జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్న అరకు గిరిజన జనసేన నాయకులు

**అరకు ( జనస్వరం )** : నేడు జరిగిన మన్యం బంద్ లో జనసేన నాయకుడు (మాజీ ఎంపీటీసీ) దురియ సాయిబాబా అరకు నియోజక వర్గం అనంతగిరి మండలంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం గిరిజ నేతరులైన (బోయ వాల్మీకి. బెంతు, ఒరియా తెగలను ఎస్టీ జాబితాలో చేర్పించాలని మార్చి 24 తేదీన అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. తక్షణం మే ప్రభుత్వం తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రంలో జనసేన



నాయకులు, ఇతర సంస్థల నాయకులు పాల్గొన్నారు.

## కొత్త చిలుమూరు లంకా గ్రామంలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ చలివేంద్రం ఏర్పాటు

వేమూరు ( జనస్వరం ) : నియోజవర్గంలోని కొత్త చిలుమూరు లంకా గ్రామంలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ గారి చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా రూపుదిద్దారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా కార్యదర్శి సోమరౌతు అను రాధ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండుతున్న ఎండల నుంచి ప్రజల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారి సేవ స్ఫూర్తితో నిర్వహిస్తున్న చలివేంద్రా కేంద్రం నిర్వహిస్తూ ప్రజల యొక్క దాహార్తి తీర్చుతున్న జనసేన శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సోమరౌతు బ్రహ్మం, కమ్మెల శ్రీనివాసరావ్ (కార్యదర్శి), బోడియ్య (కార్యదర్శి), చలమయ్య మండల ప్రెసెంట్, పెసర్లంక రత్తయ్య -(President), వలివేటి.సుబ్రమణ్యం – (MPTC), గాజుల నగేష్ (MpTC), ఈయని మణికంత, బొద్దుల అనూష – (MPTC), బొద్దుల నాగరాజు, రామాంజనేయులు, దూలిపూడి నవీన్, అమ్మిరాజు, సాయిశర్మ, పాలవల భాస్కర్ వీరమహిళలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.




## ప్రమాదంలో మరణించిన జనసైనికుని జ్ఞాపకార్థకంగా రక్తదానం చేసిన జనసైనికులు, గ్రామస్తులు



**పెందుర్తి ( జనస్వరం )** : కోదూరు గ్రామ జనసేన పార్టీ క్రియాశీలక మెంబర్ శ్రీ.శే బొబ్బరి మోహన అప్పలనాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకస్మాత్తుగా స్వర్గస్తులైనారు. వారి మిత్రమండలి, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో తాసుబల్లి ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదాతలకు పెందుర్తి నాయకులు వబ్బిన జనార్ధన శ్రీకాంత్ గారు చేతుల మీదుగా సర్టిఫికెట్స్, మొక్కలు ఇవ్వడం జరిగింది. శ్రీకాంత్ గారు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ప్రమాదవశాత్తు మరణించిన బొబ్బర మోహన్ గారి పేరు మీద వారి మిత్రమండలి, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సుమారు 100 మంది రక్తం దానం చేయడాని హర్షించవలసిన విషయం అని అన్నారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మరిసా నర్సింగ్, బల్రెడ్డి ప్రసాద్, శంకర్ నాయుడు, గోపి, గవరా శ్రీను, రాడి పెంటారావు, మరియు స్థానిక జనసేన పార్టీ నాయకులు ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జడ శ్రావనకుమర్ పై అమలాపురం జనసేన ఇంచార్జ్ శెట్టి బత్తుల రాజబాబు ఫైర్

**అమలాపురం ( జనస్వరం )** : కోనసీమ అల్లర్లు వెనక జనసేన పార్టీ ఒక ప్రముఖ నాయకుడి పాత్ర వుందని, జనసేన పార్టీ హస్తముందని, కోనసీమ యువతని జనసేన పార్టీ ఉసుగొల్పిందని, జడ శ్రావణ్ కుమార్ చేస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తవం, శ్రావణ్ కుమార్ నీదగ్గర ఆధారాలు వున్నాయా దమ్ము ధైర్యం ఉంటే ఆ ఆధారాలు బయట పెట్టాలని లేని పక్షంలో జనసేన పార్టీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని అమలాపురం జనసేన ఇంచార్జి శెట్టిబత్తుల రాజబాబు డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు వాడుకుని పవన్ కళ్యాణ్ గారు కుల రాజకీయాలు చేస్తున్నారని శ్రావణ్ కుమార్ ఆరోపణల వెనుక జగన్ ప్రభుత్వానికి మేలు చేసే ఆలోచన గాని వేరే పార్టీకి రాజకీయ లబ్ధి చేకూర్చే దురుద్దేశం వుందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం పైన దళితుల అభ్యున్నతి కోసం ఏర్పడిన పార్టీ జనసేన పార్టీ. ఈ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగాన్ని అరికట్టాలని మొట్టమొదట సదస్సు నిర్వహించిన పార్టీ జనసేన పార్టీ. మొట్టమొదటగా స్పందించిన రాజకీయపార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్. కోనసీమకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా నామకరణం చేయాలని మొట్టమొదట తీర్మానం చేసిన రాజకీయ పార్టీ జనసేన పార్టీ. ఇవన్నీ శ్రావణ్ కుమార్ తెలుసుకుని మాట్లాడాలి, పైగా శ్రావణ్ కుమార్ జనసేన పార్టీ జెండాను దళితవాడల్లో పాతరేస్తాం అన్నట్టుగా మాట్లాడుతున్నాడు జనసేన పార్టీ జోలికొస్తే జనసేన జెండా జోలికి వస్తే చూస్తూ కూర్చోవడానికి గాజులు తొడిగించికుని లేము అని రాజబాబు మండి పడ్డారు. జనసేన పార్టీలో ఉన్న దళిత ప్రతినిధులుగా నీకు చాలెంజ్ చేస్తున్నామని అన్నారు.




*నీకు దమ్ముంటే రా దళిత వాడల్లోకి వెళదాం దళితవాడలలో ఎవరిని ఆహ్వానిస్తారో తేల్చుకుందాం

మేజిస్ట్రేట్ ఉద్యోగంలో ఆరోపణలు ఎదుర్కొని రాజీనామా చేసిన తర్వాత మీడియాలో మాత్రమే దళిత హక్కుల కోసం మాట్లాడుతున్నావు తప్పా ఏనాడు ప్రజాక్షేత్రంలో దళిత హక్కుల కోసం పోరాడలేదు, కేవలం మీడియా పులిగా మాత్రమే నీవు మిగిలావు అంటూ శ్రవణ్ పై రాజబాబు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పుడు ప్రజల్లో రోజురోజుకీ ఆదరణ పొందుతున్న జనసేన పార్టీ పైన తీవ్ర ఆరోపణలు చేయడం వెనుక ముమ్మాటికీ జగన్ ప్రయోజనం దాగివుంది, శ్రావణ్ కుమార్ ఇప్పటికైనా విజ్ఞతతో వ్యవహరించాలి, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహదశ నాగేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సందాడి శ్రీనుబాబు, జిల్లా కార్యదర్శి చిక్కాల సతీష్, పార్టీ సీనియర్ నాయకులు మోకా బాలయోగి, ముత్తాబత్తుల శ్రీను, ఆకుల బుజ్జి, తాళ్ల రవి, తూము రమేష్,ఆర్లపల్లి దుర్గ పాల్గొన్నారు.

## విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేనలోకి వైసీపీ కార్యకర్తల చేరికలు

విశాఖపట్నం ( జనస్వరం ) : జనసేన సీనియర్ నాయకులు టి.శివ శంకర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. దక్షిణ నియోజక అల్లిపురం నేరెళ్ల కోనేరు వద్ద బుధవారం దక్షిణ నియోజక వర్గంనకు చెందిన సుమారు వందమంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు జనసేనలోకి చేరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శివ శంకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాలను జనసేన పార్టీ శాసిస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికలలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. రాబోయే రోజులలో వైసిపి నుంచి మరిన్ని చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన పార్టీ బలంగా ఉందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయిందని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అధికార మార్పు ఖాయమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు డా.బొడ్డేపల్లి రఘు ,శివప్రసాద్ రెడ్డి , డాక్టర్ మూగి శ్రీనివాస్,తెలుగు అర్జున్ , తెలుగు లక్ష్మి , ఉసిరిగాయల యజ్ఞశ్రీ, యర్రం శెట్టి సురేష్ కుమార్ , లంక త్రినాధ్ , బెజవాడ హరికృష్ణ , అంతోని , ప్రణీత్ , రఘు , త్రినాద్ , రూపా , మంగ , కందుల బద్రీనాథ్, కందుల కేదార్నాథ్ ఇతర జనసేనుకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.



## గుండా జయప్రకాష్ నాయుడు అక్రమ అరెస్ట్ ను ఖండించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జనసేన పార్టీ నాయకులు

భీమవరం ( జనస్వరం ) : పశ్చిమ గోదావరి జిల్లా జనసేన నాయకులు సబ్ జైలుకు వచ్చి జయప్రకాష్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఆక్షన్ ద్వారా 1.15 సంట్ల స్థలంలో రెడ్డి & రెడ్డి సంస్థకు చెందిన రౌడీలు కంచె వేస్తుంటే తన స్థలంలోకి అక్రమంగా ప్రవేశించారని పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేయడానికి వెళ్లారు. అధికార పార్టీ మంత్రి, అధికార పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడికి వల్ల పోలీసులు అక్రమంగా కంప్లైంట్ ఇవ్వడానికి వచ్చిన వారిని నేరస్తులుగా కేస్ పెట్టి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీ తరుపున పూర్తి మద్దతు ఇస్తూ న్యాయ పోరాటం చేస్తామని తెలియచేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇన్చార్జి బొలిశెట్టి శ్రీనివాస్,జనసేన పార్టీ నాయకులు అడ్వకేట్ అనుకుల రమేష్, నరసాపురం



నియోజకవర్గ జనసేనాయకులు చాగంటి మురళీకృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లా జనసేన పార్టీ పిఏసి మెంబర్ కనకరాజు సూరి, ఉండి నియోజకవర్గం ఇన్చార్జి జుత్తిగ నాగరాజు, గుండా రామకృష్ణ తదితరులు గుండా జయప్రకాష్ నాయుడు ను తణుకు సబ్ జైలుకు వెళ్లి పరామర్శించి ఆయనకు పూర్తిగా అండగా ఉంటామని తెలియపరిచారు.

## చిన్న బురాడ పేట గ్రామంలో చెరువు గండిని పూడ్చడానికి ఆర్థిక సహాయం అందించిన జనసేన నాయకురాలు లోకం మాధవి

**నెల్లిమర్ల ( జనస్వరం )** : శ్రీ రామనవమి పండుగ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గంలోని చిన్న బురాడ పేట గ్రామంలో గ్రామ ప్రజల ఆహ్వానము మేరకు రామమందిరంలో జరుగుతున్న పూజకు నెల్లిమర్ల జనసేన ఇంచార్జ్ లోకం మాధవి హాజరయ్యారు. అక్కడ సుమారు 60 మంది రైతులు గత మూడేళ్లుగా చెరువుకి గండిపడటంతో ఎంతో నష్టపోయారని తెలుసుకొన్న ఆమె గత ఆదివారం వారిని కలిసి వారి పొలాల గండి పూడ్చించడం జరిగింది. ఆ గండి పూడ్చించడానికి అయిన మొత్తం ఖర్చు పందుగరోజు గ్రామ పెద్దల సమక్షంలో ఆ రైతాంగానికి అందజేశారు. అలాగే వారు గత 3 ఏళ్లుగా దాదాపు 300 ఎకరాలు పైబలుకు ఉన్న భూమిలో నడవడానికి కూడా ఎంతో కష్టంగా ఉంటుందని తెలియజేశారు. వారు తింటున్న క్యారేజీలు కానీ, యూరియా బస్తాలు కానీ మోయటం ఎంతో కష్టతరంగా ఉందని, అదే వర్షాకాలంలో అయితే వారి బాధ వర్ణనాతీతం అని అక్కడి ప్రజలు మాధవి గారికి తెలపడంతో వారి రాస్తా నిర్మాణానికి తమ వంతు సహాయం అందచేస్తామని మాధవి గారు భరోసా కల్పించారు.

